క్లుప్తంగా

నేడు పెద్దిరెడ్డి పర్యటన


పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు: మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం పట్టణంలోని పలు ప్రైవేట్ కార్యక్రమాల్లో పాల్గొంటారని సీమ జిల్లాల మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్ ఫకృద్దీన్ షరీఫ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ నేత జిమ్‌ఇర్ఫాన్ కుమార్తె వివాహ వేడుకల్లో, ఇతర కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

సారా స్వాధీనం.. వ్యక్తి అరెస్ట్

పుంగనూరు: మండలంలోని పూజగానిపల్లి వద్ద 36 లీటర్ల నాటు సారా తరలిస్తున్న బుక్యా రవినాయక్‌ను శనివారం పట్టుకుని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. అలాగే జువ్వలదిన్నె తండాలో సారా తయారీకి నిల్వ చేసిన 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు.

ఎదుగుదలకు వైకల్యం అవరోధం కాదు


బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ

బైరెడ్డిపల్లె: అంగవైకల్యం మనిషి ఎదుగుదలకు అవరోధం కాదని, వాటి గురించి నిరాశతో కుంగిపోవాల్సిన అవసరం లేదని ఎంఈఓ సుబ్రమణ్యం అన్నారు. స్థానిక భవిత కేంద్రం వద్ద శనివారం ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం సందర్భంగా బ్రెయిలీ లిపి సృష్టికర్త లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఫిజియోథెరపిస్ట్ భార్గవి, ఐఈఆర్‌టీ నిర్మలకుమారి, సీఆర్‌పీలు రామచంద్ర, షాబుద్దీన్, వెంకటరమణ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ


భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

పెద్దపంజాణి: రాయలపేట ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల, ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని శనివారం ఎంపీడీఓ బాలాజి తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా రుచి చూశారు. భోజనంలో నాణ్యతా ప్రమాణాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిలకపుత్తూరు, కోగిలేరు గ్రామాల్లో ప్రభుత్వ కాలనీ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి వేగవంతం చేయాలని లబ్ధిదారులకు సూచించారు. సర్పంచ్ అరుణ, పీఎస్ రెడ్డిప్రకాష్, హెచ్‌ఎంలు శ్రీనివాసులు, షేక్ మహ్మద్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మురళి, వెల్ఫేర్ అసిస్టెంట్‌సోమశేఖర్ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల మండల వ్యవసాయ శాఖాధికారిగా హరిప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. సదుం మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. గతంలో ఈయన మండల వ్యవసాయశాఖాధికారిగా ఇక్కడ పని చేసిన అనుభవం ఉంది.

హైందవ శంఖారావానికి తరలిన జనం


సభకు బస్సుల్లో బయలుదేరుతున్న జనం

పుంగనూరు: విజయవాడలో ఆదివారం జరగనున్న హైందవ శంఖారావం సభకు నియోజకవర్గం నుంచి 40 బస్సుల్లో తరలివెళ్లారు. ఆలయాల్లో ప్రభుత్వ జోక్యాన్ని తగ్గించాలని, హిందువుల ఐకమత్యం చాటేందుకు హిందూ జాగరణ సమితి, విశ్వహిందూ పరిషత్, ఆర్‌ఎస్ఎస్ ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

శాంతిపురం నుంచి..

శాంతిపురం: విజయవాడలో ఆదివారం జరగనున్న హైందవ శంఖారావం బహిరంగ సభలో పాల్గొనేందుకు శాంతిపురం నుంచి పలువురు తరలి వెళ్లారు. స్థానిక వీహెచ్‌పీ నాయకుల ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో హిందువులు శనివారం ప్రైవేటు వాహనాలు, రైళ్లలో బయలుదేరి వెళ్లారు. హిందువుల ఆవేదనను, డిమాండ్లను దేశానికి వినిపించేందుకు ఈ శంఖారావంలో పాల్గొంటున్నట్టు వారు పేర్కొన్నారు. వీహెచ్‌పీ నేతలు కిశోర్, గజేంద్ర, గోపి, భాస్కర్, సుధాకర్, శివకుమార్ పాల్గొన్నారు.

తెలుగులో ప్రభుత్వ ఉత్తర్వుల పట్ల హర్షం

పలమనేరు: రాష్ట్రంలో ప్రభుత్వ ఉత్తర్వులను ఆంగ్లంతోపాటు తెలుగులోనూ ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథంనాయుడు శనివారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఇదే రీతిలో తెలుగు మాధ్యమంలో చదువుకున్న వారికి సర్కారు ఉద్యోగాల్లో ప్రాధాన్యత కల్పించేలా ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు.

ఆలయానికి ముఖద్వారమే లేదాయె..!


బైపాస్ రోడ్డు ఆనుకుని ముఖద్వారం లేని కీలపట్ల రోడ్డు, (ఇన్‌సెట్) స్వామివారి ప్రతిరూపం
వృథాగా మారిన ఆర్చి

- కోనేటిరాయస్వామి ఆలయానికి దారి తెలియక ఇబ్బందులు పడుతున్న భక్తులు
- బైపాస్ రోడ్డు నిర్మాణంతో ఆలయ ముఖద్వారం కనుమరుగు

గంగవరం: ఆ ఏడుకొండలస్వామి స్వయంగా వెలిసిన తిరుమల లాంటి పుణ్యక్షేత్రాల్లో ఒకటి కీలపట్ల శ్రీ కోనేటిరాయస్వామి ఆలయం. కీలపట్లలోని చారిత్రక ప్రశస్తి కలిగిన ఈ ఆలయానికి దారెటో తెలియక ఇతర రాష్ట్రాల భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. టీటీడీ ఆధీనంలోకి వెళ్లాక ఈ ఆలయం అభివృద్ధి చెందింది. ఆలయానికి ప్రస్తుతం ముఖ్యమైన ముఖద్వారం(ఆర్చి) లేకపోవడంతో ఈ సమస్య తలెత్తింది. వాస్తవానికి దాతల సాయంతో నిర్మించిన ఒకప్పటి పాత ముఖ్యద్వారం బైపాస్ నిర్మాణం తరువాత పూర్తిగా కనుమరుగైంది. ఏళ్ల కాలంగా గంగవరం సమీపంలో జాతీయ రహదారి ఆనుకుని ఉన్న ముఖద్వారం మీదుగా కీలపట్ల ఆలయానికి భక్తులు చేరుకునేవారు. అయితే 8 ఏళ్ల క్రితం ఇదే రోడ్డు మధ్యన బైపాస్ రహదారి నిర్మించడంతో కీలపట్లకు ఎలా చేరుకోవాలో గుర్తు తెలియక భక్తులకు గందరగోళానికి గురవుతున్నారు. ఈ జనవరి మొదటి తేదీన కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చిన భక్తులు మూతపడిన దారిలోని ముఖద్వారంలో వెళ్లి ఆగిపోయారు. మళ్లీ సరైన మార్గం కోసం పలువురిని అడిగి తెలుసుకుని వెళ్లారు. పలమనేరు నుంచి 7కిలోమీటర్ల దూరంలోని కీలపట్ల శ్రీ కోనేటిరాయస్వామి ఆలయం అతి విశాలంగా ఉంది. గతంలో టీడీపీ ప్రభుత్వ పాలనలో బైపాస్ రహదారి పనులు ప్రారంభం కాగా కీలపట్ల రోడ్డు మీదుగానే ఫ్లైఓవర్ నిర్మాణం చేయాలని ఆ చుట్టుపక్కల గ్రామస్తులంతా టీడీపీ పెద్దలకు విజ్ఞప్తి చేశారు. అయితే వారి విన్నపాన్ని భిన్నంగా మరోచోట ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తి చేశారు. బైపాస్ పనులు పూర్తయ్యాక హైవే ఆనుకుని లింక్ రోడ్డు మీదుగా భక్తులు కీలపట్లకు చేరుకోవాల్సి వస్తోంది. అప్పట్లో టీడీపీ ప్రభుత్వం చేసిన తప్పిదం కారణంగానే భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం ఇప్పటికైనా బైపాస్ సర్వీస్ రోడ్డు ఆనుకుని కీలపట్ల మార్గంలో ముఖద్వారం నిర్మించేలా టీటీడీ పాలకమండలి నిర్ణయం తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

ముఖద్వారమే ముఖ్యం..



బీడీ కాలనీకి సమీపంలో బైపాస్ ఆనుకుని లింక్‌రోడ్డు వద్ద, మన్నార్ నాయనిపల్లె వద్ద ఈ రెండు చోట్ల ముఖద్వారాలు నిర్మిస్తే బాగుంటుంది. టీటీడీ పాలకమండలి ఈ సమస్యను పరిష్కరిస్తే ఎందరో భక్తులకు ఇబ్బందులు తొలగించినట్లవుతుంది. –గిరిరాజారెడ్డి, కొత్తపల్లె సర్పంచ్

రోడ్డునూ బాగు చేయాలి..



కీలపట్ల శ్రీవారి ఆలయానికి చేరుకునే రోడ్డు వద్ద ముఖద్వారంతో పాటు రోడ్డును కూడా బాగు చేయాలి. వర్షం పడితే లింక్ రోడ్డు వద్ద నీళ్లు నిలిచి, రోడ్డు పొడవునా గుంతలతో ఇబ్బందులు తప్పడం లేదు. టీటీడీ పెద్దలు ఈ రెండు సమస్యలపై దృష్టి సారించాలి. –చంద్రబాబు, కీలపట్ల

ఆ రెండూ అజెండాలో..



కీలపట్ల ఆలయానికి ముఖద్వారం నిర్మించాలని కొంతమంది భక్తులు మా దృష్టికి కూడా తీసుకొచ్చారు. అలాగే ప్రస్తుతం ఉన్న రోడ్డును కూడా కొంత బాగుచేయాలని కోరారు. దీనిపై పాలక మండలి పెద్దలతో చర్చించినప్పుడు సానుకూలంగా స్పందించారు. ఇంజినీర్లు వచ్చి సమస్యలను పరిశీలించి వెళ్లారు. త్వరలో పనులు ప్రారంభించేందుకు టీటీడీ అన్ని చర్యలు తీసుకుంటుంది. –నీరుకుండ గజేంద్ర, టెంపుల్ ఇన్‌స్పెక్టర్

కీలపట్ల విద్యార్థుల ప్రతిభ


విజేత విద్యార్థులతో ఎంఈఓ-2

గంగవరం: అనంతపురానికి చెందిన వేమన ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేమన జయంతి పురస్కరించుకుని నిర్వహించిన పద్యాల పోటీల్లో మండలంలోని కీలపట్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 10మంది పాల్గొని గెలుపొందారు. ఈ పోటీల్లో నెగ్గిన విద్యార్థులకు మెడల్స్‌తో పాటు ప్రశంసాపత్రాలను ఫౌండేషన్ వారు అందించినట్టు ఎంఈఓ-2 శ్రీనివాసులు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులను శనివారం పాఠశాలలో అభినందించారు. పాఠశాల హెచ్‌ఎం దామోదరం, ఉపాధ్యాయులు తులసినాథంనాయుడు పాల్గొన్నారు.

దుప్పట్ల వితరణ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాతలు

వి.కోట: స్థానిక సాయిగార్డెన్‌లోని పాఠశాలలోని విద్యార్థులకు సత్యసాయిబాబా శతజయంతి ఉత్సావాలను పురస్కరించుకుని సత్యసాయి సేవా సంస్థ ద్వారా శనివారం దుప్పట్లు, చాపలు వితరణ చేశారు. సేవా సంస్థ అధ్యక్షుడు మధుసూదన్, కన్వీనర్ చంద్రశేఖర్ చేతుల మీదుగా పాఠశాల నిర్వాహకురాలు భార్గవికి అందజేశారు. సేవా సంస్థ సభ్యులు గజేంద్రరెడ్డి, శాంతి, నగేష్, భార్గవి పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

- సీనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ


విజేతలకు బహుమతులను అందజేస్తున్న జడ్జి ఆదినారాయణ

పలమనేరు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ముఖ్యంగా బాల్య వివాహాల కారణంగా మహిళాభివృద్ధికి ఆటంకాలు తప్పవని పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ సూచించారు. ఆమేరకు పట్టణ సమీపంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం ఆయన బాల్యవివాహాల నిర్మూలనపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కళాశాలలో ర్యాగింగ్ సంస్కృతి మంచిది కాదన్నారు. దీనికి సంబంధించి ప్రత్యేక చట్టాలున్నాయన్నారు. విద్యార్థినులు చదువుతోపాటు చట్టాలపై కాస్త అవగాహన తెచ్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలపై విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఆపై కళాశాల వసతిగృహం, భోజనశాలను ఆయన తనిఖీ చేశారు. ఏదేనీ సమస్యలున్నాయా అంటూ పిల్లలను అడిగి తెలుసుకున్నారు. ఏపీపీ రంజిత్, న్యాయవాదులు ఆరీఫుల్లా, ప్రిన్సిపల్ మహమూద్ పాల్గొన్నారు.

వేలం పాట నిర్వహించాలి


కైగల్ జలపాతం (ఫైల్)

బైరెడ్డిపల్లె: మండలంలోని తీర్థం సచివాలయ పరిధిలోని కైగల్ జలపాతం వద్ద వాహనాలకు వేలం పాట నిర్వహించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. గతంలో వేలం పాట నిర్వహించడంతో ఏడాదికి రూ.4 లక్షలు పంచాయతీకి ఆదాయం వస్తుండేదని, వేలం పాట గడువు రెండు నెలలకు ముందే అయిపోయినా వేలం పాట నిర్వహించలేదని వాపోయారు. ఇది వరకు వేలం పాట దక్కించుకున్న వారే వసూళ్లు చేస్తూ పంచాయతీకి ఆదాయం లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం పర్యాటక ప్రాంతమైన కైగల్ జలపాతం వద్దకు వందలాది వాహనాలు వస్తుంటాయని, పాత బిల్లులతోనే వాహనాల వద్ద పార్కింగ్ డబ్బులు వసూళ్లు చేస్తున్నారని మండిపడుతున్నారు. అధికారులు స్పందించి వేలం పాట నిర్వహించాలని పంచాయతీ వాసులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీఓ రాజేంద్ర బాలాజీని వివరణ కోరగా కైగల్ జలపాతం వద్ద వేలం పాట గడువు పూర్తయ్యిందని, త్వరలోనే వేలం పాట నిర్వహిస్తామన్నారు.

భవితలో బ్రెయిలీ వేడుకలు



దివ్యాంగ పిల్లలతో మాట్లాడుతున్న ఎంఈఓ, రొంపిచెర్ల: బహుమతి ప్రదానం చేస్తున్న అధికారులు

పుంగనూరు: పట్టణంలోని భవిత కేంద్రంలో బ్రెయిలీ జయంతిని ఘనంగా నిర్వహించారు. శనివారం ఎంఈఓలు చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డెన్నశెట్టి ఆధ్వర్యంలో బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చౌడేపల్లె: అంధుల జీవితాల్లో వెలుగు నింపిన సూరీడుగా లూయిస్ బ్రెయిలీ చరిత్రలో నిలిచిపోయారని ఎంఈఓలు కేశవరెడ్డి, తిరుమలమ్మ కొనియాడారు. బ్రెయిలీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు హరినాథ్, శంకర్, భవిత సిబ్బంది రామమోహన్, నరేష్, రోజా, ఎంఐఎస్ కోఆర్డినేటర్ వసంత పాల్గొన్నారు.

ఘనంగా లూయిస్ బ్రెయిలీ డే

గుడుపల్లె: స్థానిక భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను ఎంఈఓ లక్ష్మయ్య ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరుపుకున్నారు. దివ్యాంగ పిల్లలకు బహుమతులు అందించారు. ప్రభు, రజిత, మణి పాల్గొన్నారు.


చౌడేపల్లె: మాట్లాడుతున్న ఎంఈఓ కేశవరెడ్డి

దివ్యాంగులు రాణించాలి

రొంపిచెర్ల: దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలని ఎంఈఓ ఇందిర అన్నారు. శనివారం రొంపిచెర్ల భవిత కేంద్రంలో ప్రపంచ బ్రెయిలీ దినోత్సవాన్ని నిర్వహించారు. 2024లో పదవ తరగతిలో ఉత్తీర్ణులైన దివ్యాంగ విద్యార్థులు అస్లాం, ప్రవీణ్, శశిధర్, తేజశ్రీ, లతకు బహుమతి ప్రదానం చేశారు. ఎంఈఓ శ్రీనివాసులు, బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీదేవి, సహిత ఉపాధ్యాయులు అమ్ములు, మానస, మండల దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు ఇర్షాద్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ అలీ, అబ్దుల్ రెహమాన్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని సద్వినియోగం చేసుకోండి


మధ్యాహ్న భోజనాన్ని వడ్డిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు


సదుం: భోజనం వడ్డిస్తున్న ప్రిన్సిపల్ వెంకటనాథరెడ్డి

వి.కోట: జూనియర్ కళాశాల విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సూచించారు. శనివారం మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతనంగా ప్రారంభించిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని జెడ్పీ చైర్మన్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఆయన విద్యార్థులకు భోజనాన్ని వడ్డించారు. మాజీ మార్కెట్ చైర్మన్ రామచంద్రనాయుడు, నేతలు రంగనాథ్, కళాశాల ప్రిన్సిపల్ బాలకృష్ణారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు. పత్రపల్లి సచివాలంలో శనివారం చంటి పిల్లలకు వేసే వ్యాక్సిన్ కార్యక్రమాన్ని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పరిశీలించారు.

ఇంటర్‌లో మధ్యాహ్న భోజనం

సదుం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తామని ప్రిన్సిపల్ వెంకటనాథరెడ్డి తెలిపారు. ఇన్‌చార్జి తహసీల్దార్ మారుఫ్ హుస్సేన్, హెచ్‌ఎం జయకుమార్ రెడ్డి, ఎంఈఓ దామోదర, ఏఎస్‌ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

గుడుపల్లెలో..


గుడుపల్లెలో..

గుడుపల్లె: ప్రభుత్వం కళాశాల ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ప్రిన్సిపల్ రామక్రిష్ణమనాయుడు ప్రారంభించారు. టీఎం బాబునాయుడు పాల్గొన్నారు.

సన్మానం


హారికను సన్మానిస్తున్న ఉద్యోగులు

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేసిన హారికను సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఇక్కడ నాలుగు సంవత్సరాలుగా జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి పీలేరు హైస్కూల్‌కు బదిలీ అయ్యారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీవాణి, వెంకటసిద్ధులు పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధికి కృషిచేద్దాం

- ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి


పలమనేరు: ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పలమనేరు: పలమనేరు ఏరియా ఆస్పత్రి అభివృద్ధిలో సలహా కమిటీ కీలకంగా మారి అభివృద్ధికి కృషిచేద్దామని స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. ఆమేరకు ఏరియా ఆస్పత్రి కమిటీ సలహా సంఘ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆస్పత్రిలో శనివారం ఎమ్మెల్యే అధ్యక్షతన జరిగింది. సలహా కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, సభ్యులుగా ఎంపీ ప్రసాదరావు, స్థానిక ఆర్డీఓ భవాని, అడిషనల్ డీఎంహెచ్ఓ వెంకటప్రసాద్, సోషల్ వర్కర్లు గ్యాస్ నాగరాజు, సుధాకర్, మహిళా సమాఖ్య నుంచి చంద్రకళ, రిటైర్డ్ డాక్టర్ సుబ్రమణ్యం, ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.మమతారాణి, ఏపీహెచ్ఐఎంఎస్‌డీసీ ఈఈ జయకుమార్ ఉన్నారు. వీరిలో కొందరు ప్రమాణ స్వీకారం చేశారు.

మధ్యాహ్న భోజనం ప్రారంభించిన ఎమ్మెల్యే..

పలమనేరు: రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలో శనివారం ప్రారంభించారు. ఆపై ఆయన పిల్లలకు భోజనాన్ని వడ్డించారు. ఇందులో పట్టణానికి చెందిన టీడీపీ నేతలు బాలాజి, కుట్టి, నాగరాజు పాల్గొన్నారు.

జైభీమ్ క్యాలెండర్ల ఆవిష్కరణ


క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న సభ్యులు

గంగవరం: జై భీమ్ యూత్ ఫౌండేషన్ న్యూఇయర్ క్యాలెండర్లను చైర్మన్ శంకర్, సభ్యుల ఆధ్వర్యంలో మండలంలోని కల్లుపల్లిలో శనివారం ఆవిష్కరించారు. గ్రామంలోని దళిత వాడ ప్రజలతో కలసి క్యాలెండర్లు ఆవిష్కరించినట్టు ఆయన పేర్కొన్నారు. అలాగే ఈనెల 11, 12వ తేదీల్లో పెద్దపంజాణి మండలం గోనుమాకులపల్లి మైదానంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

బైరెడ్డిపల్లె: పోషకాహారం తినడం వలన విద్యార్థులు ఆరోగ్యవంతంగా ఉంటారని హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ అన్నారు. కమ్మనపల్లె గురుకుల పాఠశాలలో శనివారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శోభ, సీహెచ్ఓ సాయిదివ్య, ఉపాధ్యాయులు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

పెద్దపంజాణి ఎంపీడీఓకు పురస్కారం


పలమనేరు బాలాజి

పలమనేరు: పట్టణానికి చెందిన ప్రముఖ రచయిత, పెద్దపంజాణి ఎంపీడీఓ పలమనేరు బాలాజీకి బీసీ సంఘర్షణ సమితి వారిచే బహుజన సామాజిక రచయిత పురష్కారానికి ఎంపికయ్యారు. ఆమేరకు నేడు తిరుపతి ఎస్వీయూ సెనేట్ హాలులో జరిగే కార్యక్రమంలో ఆయన ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. ఇందుకు సంబంధించి నిర్వాహకులు లక్ష్మయ్య, సాకం ప్రభాకర్‌ల నుంచి ఆయనకు ఆహ్వానం అందింది. ఆయనతోపాటు డా.వీఆర్ రాసాని డా.మౌని, అరుణకుమారి, ఎంవల్లి భారతి, పేరూరు సుబ్రమణ్యం సైతం పురస్కార గ్రహీతలుగా ఉన్నారు. కాగా పలమనేరు బాలాజీ 1991 నుంచి కథ, కవిత, నవల, విమర్శ రంగాల్లో సేవలందిస్తున్నారు. రెండు పర్యాయాలు తెలుగుభాషా పురష్కారాన్ని అందుకున్నారు. జిల్లాకు చెందిన కవులు, రచయితలు ఆయనకు అభినందనలను తెలిపారు.

యంత్రాలతో ఉపాధి పనులు

- పేదల పథకం పచ్చనేతలకు భోజ్యం
- బిల్లులు పెట్టుకుని జేబులు నింపుకుంటున్న తెలుగు తమ్ముళ్లు
- మాముళ్ల మత్తులో అధికారులు


జేసీబీలతో చేస్తున్న కుంట పనులు

వి.కోట: ఉపాధి హామీ పథకం పచ్చనేతలకు వరంగా మారింది. యంత్రాలతో పనులు చేసి యథేచ్ఛగా బిల్లులు పెట్టుకుని జేబులు నింపుకుంటున్నారు. అధికారులతో కుమ్మక్కయి పేదలకు అందాల్సిన పథకాన్ని పక్కదోవ పట్టించి తెలుగు తమ్ముళ్లు అందిన కాడికి దోచుకు తింటున్నారు. ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలన్న లక్ష్యంతో 2005లో ఉపాధి పథకం కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. గ్రామాల్లో వలసలు నివారించి స్థానికంగా పని కల్పించాలన్న సంకల్పంతో పథకాన్ని అమలు చేస్తోంది. ప్రతి ఏటా కోట్ల రూపాయలు ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయిస్తుంది. అందుకు భిన్నంగా మండలంలో ఉన్న వారికే ఉపాధి అన్న చందంగా జరుగుతోంది. మండలంలోని కొంగాటం పంచాయతీ అత్రపల్లి చెరువు వద్ద తెలుగు తమ్ముళ్లు పట్టపగలే జేసీబీ యంత్రాలతో ఉపాధి పనులు చేపడుతున్నారు. ప్రజలకు అనుమానం రాకుండా ట్రాక్టర్ల ద్వారా మట్టిని బయటకు తరలిస్తున్నట్లు నటిస్తున్నారు. గ్రామ పంచాయతీల వారిగా తెలుగు తమ్ముళ్లు చెరువులు పంచుకున్నారు. యంత్రాలతో కుంటలు తవ్వి బిల్లులు పెట్టుకుని జేబులు నింపుకుని ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. ఒక్కో కుంటను 4 నుంచి 5 గంటల సమయం జేసీబీలతో తవ్వి రూ.4 లక్షల నుంచి 5 లక్షల వరకు బిల్లులు పెట్టుకోవడం పరిపాటిగా మారింది. మాముళ్ల మత్తులో పేదల పథకానికి అధికారులే తూట్లు పొడుస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉపాధి హామీ క్షేత్ర స్థాయి సిబ్బంది నుంచి పైస్థాయి అధికారుల వరకు వాటాలు చేరుతున్నట్లు పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఫీల్డ్ అసిస్టెంట్ నుంచి ఏపీఓ వరకు ప్రతి పనిపై పూర్తిగా కూలీల వివరాలు, జరిగిన పని ఫొటోలు, హాజరు పట్టికలు, తనిఖీలు, ఆన్‌లైన్‌లో అప్లోడ్, బిల్లులు పెట్టడం ఇంత వ్యవహారం జరగాలి. అయితే అధికారుల పర్యవేక్షణ లేకుండానే తెలుగు తమ్ముళ్ల ఒత్తిడికి మండల ఏపీఓ ఏమీచేయలేని పరిస్థితి నెలకొని బిల్లులు పెడుతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అవినీతి రాజ్యమేలుతోంది. కలెక్టర్ స్పందించి యంత్రాల ద్వారా పనులు చేస్తు ఉపాధి నిధులు రూ.లక్షల ప్రజాధనాన్ని కాజేస్తున్న అక్రమార్కులపై చర్యలు తీసుకుని ఉపాధి పథకం ఆశయాన్ని రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.